# సీడపీడలు — కప్పగంతుల మల్లిఖార్జునరావు

"ఊరంతా నవ్విపోతన్నారు. ఆడెవడో పోరం బోకు ఎమ్మెల్యేకోసం మన 'గిహాప్రెవేసెం' ఆగిపోటం ఏందంట? ఎల్లుండి మంచి ముహూర్తమంట పంతులు గోరు సెప్పేరు. నేనెల్లి నాఇంటో సేరిపోతా. ఆ—" ఎంకటేశు చెప్పల్లో కాలు పెట్టకముందే పురాణం లంకించుకుంది చిట్టెమ్మ. ఎప్పటినుంచో కోరిక. ఆమె పాచిపనిచేసే పదిళ్ళవాళ్లు అద్దె యిళ్ళల్లో వుంటూ స్వంత భవనాలు కట్టుకున్నారు. ధూమ్‌ధూమ్‌గా గృహ ప్రవేశాలు చేశారు. ఆ యిళ్ళన్నీ తనవే అయినట్టు హంగామా చేసింది చిట్టెమ్మ. వీడియోలలో పడింది. తెరపై అంత పెద్ద భవనంలో తనని చూసుకుని మురిసిపోయింది.

అప్పటినుంచి ఆమెకు పెద్దపెద్ద భవనాలు, గృహ ప్రవేశ మహోత్సవ దృశ్యాలు కళ్లుమూసినా తెరిచినా కన్పించసాగాయి. అలాంటి స్థితిలో నాలు గేళ్ళ క్రితం కాలువ వొడ్డున కొంత స్థలాన్ని ఆక్రమించి వేసుకున్న వాళ్ల




పూరిపాక తుఫానుకు కొట్టుకుపోయింది. అలా యిళ్లుపోయిన ఇరవై మంది నిరాశ్రయ కుటుంబాలలో చిట్టెమ్మ కుటుంబం కూడా చేరింది.

అప్పట్లో మంత్రులు, అధికారులు వచ్చి వాళ్లకు కొత్త స్థలాలు ఇస్తామని, పక్కా ఇళ్ళు కట్టిస్తామని వాగ్ధానాలు చేసేరు. అర్జీలు తీసుకున్నారు.

నాలుగేళ్లు గడిచేయి. ప్రభుత్వాలు మారేయి. అధికారులు మారేరు. ప్రభుత్వం చేసిన వాగ్ధానాలను అంతా మర్చిపోయారు. ఒక్క చిట్టెమ్మ తప్ప.

దొంగ సచ్చినోళ్లు ఎన్ని మాయమాటలు సెప్పినారు. ఆళ్లు మర్చిపోతే నేను మర్చిపోతానా? పాచి పనులుచేసే వారిళ్లల్లో వారితోనల్లా చెప్తకుంది. సహాయం చేయమంది. ఎవరూ ఆమె గోడు పట్టించుకోలేదు. అప్పుడామె మొగుడిపైకి దండయాత్ర మొదలుపెట్టింది.

ఏడన్నా కాస్త జాగా సంపాదించవయ్యా. సిన్న పాకేసుకుందాం. కావాలంటే కలెక్టరాఫీసుముందు నేను నిరాహార దీచ్చ చేత్తాను. ఎంకటేశు హోల్‌సేల్ కొట్ల దగ్గర బస్తాలు మోస్తాడు. కండల్తోపాటు గుండె, హృదయంకూడా వున్న మనిషి. పదిమందిలో పరోపకారి అన్నపేరు సంపాదించాడు. భార్య పోరంగా పోరంగా ఎంకటేశు నడుం బిగించాడు. వరద బాధితులందర్నీ కలిశాడు. అర్జీలు రాయించి సంతకాలు పెట్టించాడు. ఆఫీసులచుట్టూ ప్రదక్షిణలు చేయసాగాడు.

'తనుదూర కంతలేదుకానీ... అన్నట్టుందయ్యా నీయవ్వారం! మనకింత జాగా సంపాదించయ్యా అంటే ఊరందర్ని కలిపేవేంది? ఆళ్ళందరికోసం నువ్వెందుకు తిరగాలంట? యిట్టా ఊరోళ్లందర్కీ జాగాలియ్యమంటే ఆ ఇచ్చేవోళ్లు నీక్కూడా యియ్యరు.

తనని గురించి తప్ప ఇతరులని గురించి పట్టించుకోని తత్వం చిట్టెమ్మది. తనతోపాటు పదిమంది మంచిచెడ్డల్ని చూసేతత్వం ఎంకటేశుది.

'అర్జీలు, విన్నపాలు, ప్రదక్షిణల వల్ల పనులుకావు ఎంకటేశు. డబ్బున్నా ఖర్చుపెట్టాల, మంత్రుల్నో, ఎమ్మెల్యేలనో పట్టుకోవాల.'

ఆమాత్రం ఎంకటేశుక్కూడా తెలుసు. కానీ రెండు అతనివల్ల కానిపనులు. కనుక పట్టుదలగా పెద్ద ఆఫీసర్లకు, చిన్న ఆఫీసర్లకు, బుల్లి ఆఫీసర్లను కలిసి గోడు చెప్తకుంటూనే వున్నాడు.

అలా చెప్తకోగా చెప్తకోగా ఏ అయ్యకి దయ కలిగిందో చెత్త కాగితాల్లో కలిసిపోయిన ఫైలుకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. పైకి ఎగబాకింది.

ఒక సుముహూర్తంలో ఇరవై తుఫాను బాధిత నిరాశ్రయ కుటుంబాలకు స్థలం మంజూరుచేస్తూ ఆర్డర్లు వచ్చాయి.

ఆ ఉత్సాహంతో అందరి దగ్గర డబ్బు వసూలు చేసి తక్కువ ఖర్చుతో ఇరవై మందికి యిళ్లు తానే దగ్గరుండి కట్టించాడు ఎంకటేశు.

అప్పుడు ఆ ప్రాంత ఎమ్మెల్యే అనుచర వర్గంతో అక్కడికొచ్చి ఎంకటేశును పొగిడి ఆ కాలనీకి కష్టజీవుల కాలనీ అని నామకరణం చేసేడు. ఎవరూ అడక్కుండానే తానే ఆ కాలనీకి ప్రారంభోత్సవం చేస్తానని పదిమందిముందు ప్రకటించాడు.

అప్పటినుంచే ఎంకటేశు కష్టాలు ఆరంభమయ్యాయి.

నిరాశ్రయులు ఇరవై మందికి ఎప్పడెప్పుడు సొంత యిళ్లల్లో చేరదామా అన్న ఆరాటం. ప్రారంభోత్సవం చేయిద్దామంటే ఎమ్మెల్యే దర్శనం కాదు.

చివరికి చిట్టెమ్మ అల్టిమేటం ఇచ్చింది. పదిమంది ఆడవాళ్లను పోగేసుకుని

వెళ్లి ఆ రాత్రి కాలనీలోనే ఆరుబయట నిద్రపోయింది.

ఇంట్లో ఆడాళ్లతో తగాదాలు ఎందుకు ఎంకటేశు. సిట్టెమ్మ సెప్పిన ముహూర్తానికి ఆ పేరంభోత్సవమేంటో నువ్వే సేసెయ్యి ఇళ్ళల్లో సేరిపోదాం.

'కాదు పెద్దోడు. రిచ్చా రత్తయ్య మామతో తోసేయిద్దాం.

ఆ రాత్రికి అక్కడ ఆడవాళ్లు, ఇక్కడ మగవాళ్లు నిశ్చింతగా నిద్రపోయారు.

తెలతెలవారుతుండగా కాలనీలో వాక గుడిసెకు ఎలా నిప్పంటుకుందో అంటుకుంది. పదిమంది ఆడాళ్లు చేతికి ఏది చిక్కితే దాంతో మంటలార్పడానికి సిద్ధమయ్యారు. దారినపోయేవారిని సాయం చేయమని బతిమలాడేరు.

అప్పుడు ఒక స్వామివారు మార్నింగ్‌వాక్‌కని ఆ వైపువచ్చి ఆ దృశ్యాన్ని చూశాడు.

'సోమీ సోమీ మీ మగత్తుతో మంటల నార్పండి. మా దగ్గర కుండలు కూడా కొద్దిగానే వున్నాయి. కాకపోతే వాకకుండ తీసుకుని పది కుండలు నీళ్ళుపోయండి' చిట్టెమ్మ స్వామి దగ్గరకెళ్లి అంది.

'ఈ పాకలు మీవేనా?'

'అవును సోమీ చెమటోడ్చి కట్టుకొన్నాం'

'అది మీ భ్రమ. మొన్నమొన్నటి దాకా యీ పాకలు ఇక్కడ లేవు. నిన్న వచ్చాయి. ఇవాళ కాలిపోతున్నాయి. రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? అశాశ్వతమైన పాకలకోసం అంత ఆరాటం ఎందుకు? శాశ్వత ఆనందదాయకమైన మోక్షాన్ని చేరుకోవడానికి మార్గం చూసుకోండి'

'ఇల్లుకాలి మేం సత్తావుంటే మాటలు ఏంటయ్యా ఎల్లెల్లు' ఆమె చీత్కరించి మంటల నార్పటంలో మునిగిపోయింది మళ్లీ.

అప్పుడు ఒక వాసం పేలి ఆ నిప్పుకణికెలు ఎగిరొచ్చి స్వామివారి చింపిరి జట్టులో ఒకటి, దుబ్బు గడ్డంలో మరొకటి యిరుక్కున్నాయి. వెంట్రుకలు సరసరా కాలిపోసాగేయి.

'బాబోయ్ రక్షించండి. బాబోయ్ రక్షించండి' స్వామివారు చిందులేయ సాగారు.

చిట్టెమ్మ ఆయన అరుపుల్ని వింది. చిందుల్ని చూసింది. చేస్తున్న పనిని ఆపి పరిగెత్తుకుంటూ వచ్చి కుండలో నీళ్లు స్వామివారి నెత్తిన కుమ్మరించింది.

కాస్సేపటికి మంటల నార్పేసారు అంతాకలిసి.

'అమ్మా మీ ఇళ్లు కాలిపోతుంటే నేను వేదాంతం మాట్లాడేను. అటువంటి నన్ను మీరెందుకు బతికించారు?'

'మడిసికి మడిసి సాయం సేయకపోతే మానులొచ్చి సేత్తాయా? సీడపీడలు తగల్తాయని పంట చెయ్యడం మానేత్తామా ఏందీ'

అంతకుముందే అక్కడికొచ్చిన ఎంకటేశు అంతా చూశాడు.

అప్పడే అనుచరగణంతో కారు దిగుతున్న ఎమ్మెల్యేని గమనించేడు.

'నిజం సెప్పేవే చిట్టీ. సేలు పచ్చగా వున్నప్పడే సీడపీడలు పడ్తాయి' అన్నాడు వాక కంటితో స్వామిని, మరోకంటితో ఎమ్మెల్యేని చూస్తూ!

★



# ఏనుగు పిల్ల

పిల్లలంటే పండిట్ నెహ్రూజీకి ఎంతో అభిమానం, ఆదరణ అని మనకు తెలుసు! చిన్నారులందరూ ఆయన్ను ఆప్యాయతతో 'చాచా నెహ్రూ!' అని పిలిచేవారు.

జవహర్ ఎక్కడ పిల్లలు కనపడినా ఆనందంతో ఉప్పొంగిపోయేవారు. వారితోపాటు తాను కూడా ఒక పిల్లవానిగా మారి ఎన్నో సరదా అయిన ఆటలు ఆడేవారు. వారిని నవ్వుల జల్లుల్లో ముంచెత్తేవారు. ఒకసారి నెహ్రూజీ 'ఇందిర' అనే ఏనుగు గున్నను రష్యాకు పంపారు. అచ్చటి పిల్లలకు ప్రేమ పూర్వకంగా కొద్ది రోజులు గడిచిన పిమ్మట ఒక సమావేశంలో కొందరు పిల్లలు పండిట్‌జీని కలుసుకుని కొంత సేపు ముచ్చటించారు. చాచా నెహ్రూ రష్యా దేశానికి ఒక ఏనుగు పిల్లను పంపిన సంగతి ఆ పిల్లలందరికీ తెలుసు. ఒక చిన్నారి బాలిక అంది– "చాచా! నువ్వు ఇతర దేశాలకు జంతువులను పంపుతున్నావు. మమ్మల్ని ఆ విధంగా విదేశాలకు ఎందువలన పంపవు?"

అది విని నెహ్రూజీ కోపం వచ్చిన వానిలా నటిస్తూ,

"అలాగా! మీ పిల్లలు కూడా జంతువులేనని నాకు తెలియదు సుమా! అందువల్లనే మిమ్మల్ని పంపలేదు." అన్నారు.

అది విని పిల్లలంతా పకాలున నవ్వారు. వారి నవ్వులో తాను కూడా శృతి కలిపారు నెహ్రూజీ.

# హిందీ విజయం

ప్రముఖ గాంధేయవాది, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన భోగరాజు పట్టాభి సీతారామయ్య గారికి హిందీభాషపై మక్కువ ఎక్కువ. ఆయన వ్రాసే అన్ని ఉత్తరాలపై ఎడ్రెస్‌ను హిందీలో వ్రాసేవాడు. ఆసమయంలో దక్షిణాదిలో చాలా తక్కువమంది మాత్రమే హిందీభాషను చదవగలిగేవారు. ఇందువల్ల పట్టాభి గారు హిందీలో ఎడ్రెస్‌లు వ్రాయడం పోస్టల్ వారికి చాలా అసౌకర్యంగా వుండేది. అందువల్ల పోస్టల్ శాఖ వారు పట్టాభిని ఎడ్రెస్‌ను ఇంగ్లీషులో వ్రాయమని కోరారు. అందువల్ల తాము ఉత్తరాలు సులభంగా బట్వాడా చేయగలమని చెప్పారు. అందుకు పట్టాభిగారు (హిందీ మన 'జాతీయభాష' అందువల్ల నేను ఆభాషలోనే వ్రాస్తున్నాను. ఇక ముందు కూడా అలాగే వ్రాస్తాను) అని పోస్టల్‌శాఖ వారికి చెప్పారు.

ఇకమీదట కూడా పట్టాభిగారు హిందీలోనే ఎడ్రెస్‌లు వ్రాస్తే తాము వాటిని డెట్‌లెటర్ ఆఫీసుకు పంపుతామని పోస్టల్‌శాఖవారు పట్టాభిని బెదిరించారు. ఈ బెదిరింపు ఆయనపై ఏమాత్రం పనిచేయలేదు. కొంతకాలం పోస్టల్‌శాఖ వారికి, పట్టాభికి మధ్య ఈ వివాదం కొనసాగింది. చివరకు పోస్టల్‌వారు తమ ఓటమిని అంగీకరించి మచిలీపట్నం పోస్టాఫీసులో హిందీతెలిసిన ఒక వ్యక్తిని నియమించారు. ఆవిధంగా హిందీభాష విజయాన్ని సాధించింది.

కొడిమెల శ్రీరామమూర్తి